
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com



రేపు జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ బాలబాలికల జట్ల ఎంపిక

నిర్మల్‌రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల క్రీడాసమాఖ్య ఆధ్వర్యంలో జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ (అండర్- 14,17) బాలబాలికల జట్ల ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్ పాఠశాలలో ఈనెల 14న నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డి.భోజన్న, ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ రవీందర్ గౌడ్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు పలు పోటీల్లో పాల్గొంటారన్నారు.



మారథాన్‌లో మెమొంటో అందజేస్తున్న నిర్వాహకులు

కరీంనగర్ మారథాన్‌లో ఖానాపూర్ వాసుల ప్రతిభ

● డాక్టర్ కిరణ్ కుమార్ బృందానికి తృతీయ బహుమతి

ఖానాపూర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ పట్టణంలో ఆదివారం నిర్వహించిన మారథాన్ 21 కిలోమీటర్ రన్నింగ్ పోటీలలో ఖానాపూర్ బృందం ప్రతిభ కనబరిచింది. ఈ పోటీలకు ఖానాపూర్ ప్రాంతం నుంచి స్థానిక వైద్యులు కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో 21 మంది బృందం హాజరయ్యారు. కాగా 21 కిలోమీటర్ల మేరకు సాగిన ఈ మారథాన్ రన్నింగ్ పోటీలలో ఖానాపూర్‌కు చెందిన హోమియో వైద్యులు కిరణ్ కుమార్ మూడో స్థానంలో నిలిచి బహుమతి సాధించారు. గతంలో సైతం పలు మారథాన్‌లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి కిరణ్‌కుమార్ కరీంనగర్‌లో ఏకంగా మూడోస్థానంలో నిలిచి బహుమతి సాధించడంతో స్థానికంగా ఆయనను పలువురు ప్రశంసిస్తున్నారు. నిరంతరం యువకులకు అవగాహన కల్పిస్తూ మారథాన్ రన్నింగ్‌లో శిక్షణ ఇస్తూ ముందుకు సాగుతున్న కిరణ్‌కుమార్‌కు ఈ బహుమతి దక్కడంతో ఆయన బృందంలోని సభ్యులంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కరీంనగర్ మారథాన్‌కు తరలి వెళ్లిన వారిలో నువ్వుల రాజేందర్, సిహెచ్. వెంకట్రాములు, రాపెల్లి రాజు, ప్రముఖ న్యాయవాది బాశెట్టి శివకుమార్, లోకిని మహేష్, మహేష్, భాను, జన్నారపు శంకర్, తూము చరణ్, పి.శ్రీనివాస్, ముషారఫ్, పెద్ది మల్లేష్, ఎల్లయ్య, మల్లేష్ ఉన్నారు.

వంతెన.. ఇంతేనా!

● రెంకోని వాగుపై రెండు వంతెనల వద్ద నిలిచిన రోడ్డు పనులు
● ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్, నాలుగు మండలాల ప్రజలకు తప్పని ఇక్కట్లు
● ఖానాపూర్ - తర్లపాడ్, ఖానాపూర్ - దిలావర్ పూర్ మధ్య ప్రయాణం నరకం
● ఇప్పటికైనా పూర్తి చేయాలని స్థానికుల డిమాండ్



పైనుంచి కిందికి వచ్చేందుకు నెమ్మదిగా వస్తున్న వాహనాలు



పూర్తి గుంతలమయంగా మారిన అప్రోచ్ రోడ్డు



రెంకోని వాగుపై నిర్మాణం పూర్తయిన వంతెన (ఫైల్)

ఖానాపూర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : దశాబ్దకాలంగా వర్షాకాలం వచ్చిందంటే చాలు ఖానాపూర్ మండలంలోని రెంకోని వాగు ఉప్పొంగి రహదారి పైనుంచి ప్రవహించేంది. ఈ వాగు ఉధృతికి ఖానాపూర్ నుంచి పెంబి, కడెం, ఉట్నూర్, జన్నారం, మంచిర్యాల వైపు వెళ్లే రహదారికి లింకు రోడ్డు అయినా ఖానాపూర్-తర్లపాడ్ రోడ్డు, ఖానాపూర్ నుంచి కడెం, దస్తురాబాద్ మండలాలకు వెళ్లే మరో ప్రధానరహదారి అయిన ఖానాపూర్ - దిలావర్‌పూర్ రోడ్డుపై వాహనాల రాకపోకలు నిలిచిపోయేవి. దీంతో ఖానాపూర్ చుట్టుపక్కల గల పెంబి, కడెం, దస్తురాబాద్ సహా ఉట్నూర్, జన్నారం, మంచిర్యాల ప్రాంతాల నుంచి ఖానాపూర్‌కు ప్రజల రాకపోకలు సాగించేందుకు తీవ్రంగా ఇబ్బందులు పడేవారు. అటువంటి సమస్యను పరిష్కరించే దిశగా ప్రభుత్వం రెంకోని వాగుపై ఉన్న రెండు లోలెవెల్ వంతెనలను తొలగించి కొత్త వంతెనల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. కానీ ఈ రెంకోని వాగుపై చేస్తున్న వంతెనల నిర్మాణ పనులకు ఆది నుంచి ఆటంకాలే ఎదురవుతున్నాయి. ఒక అడుగు ముందుకు పడితే రెండు అడుగులు వెనక్కి పడుతున్నట్లు పనులు సాగుతున్నాయి. దీంతో నియోజకవర్గ కేంద్రమైన ఖానాపూర్‌కు రాకపోకలు సాగించేందుకు పలు మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెంకోని వాగుపై వంతెనల నిర్మాణం పూర్తయితే రాకపోకలకు ఇబ్బంది ఉండదని భావించిన ఖానాపూర్ చుట్టుపక్కల మండలాల ప్రజలకు రెండేళ్లుగా నిరీక్షణ తప్పడం లేదు. గత ప్రభుత్వ హయాంలో రెండు వంతెనలు మంజూరయ్యాయని అప్పటి పాలకులు ఆగమేఘాల మీద వంతెనల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆ తర్వాత జరిగిన పరిణామాలలో పనులు ప్రారంభం కాలేదు. ఆ తరువాత ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఖానాపూర్-తర్లపాడ్ రోడ్డు మధ్యలో గాంధీనగర్ వద్ద రెంకోని వాగు పై నిర్మించే వంతెన నిర్మాణానికి రూ. 4.5 కోట్లు, ఖానాపూర్-బెల్లాల్ రోడ్డు మధ్యలో దిలావర్‌పూర్ వద్ద రెంకోని వాగుపై నిర్మించే వంతెన నిర్మాణానికి రూ.5 కోట్లతో పనులను ప్రారంభించారు. పనులు ప్రారంభించి 20 నెలలు గడుస్తున్నప్పటికీ ఇప్పటి వరకు ఈ రోడ్లను వాహనాలు తిరిగేందుకు అనుకూలంగా మార్చడంలో అధికారులు విఫలమయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం రెండు వంతెనల నిర్మాణం పూర్తయినప్పటికీ ఈ రెండు వంతెనల వద్ద అప్రోచ్ రోడ్డు నిర్మాణం మాత్రం చేయలేదు. దీంతో వర్షాకాలం వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతుంది. రెండు వంతెనల తాలూకు బిల్లులు చెల్లించడంలో ప్రభుత్వం నుంచి జాప్యం జరుగుతున్నట్లు కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తర్లపాడ్ - ఖానాపూర్ రహదారిపై నిర్మిస్తున్న వంతెన తాలూకు ఇంకా రూ.కోటి పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఖానాపూర్, బెల్లాల్ రహదారిపై నిర్మించిన వంతెన తాలూకు బిల్లులలో రూ. 1.70 కోట్లు పెండింగ్‌లో ఉన్నట్లు చెబుతున్నారు. దీంతో వంతెనల నిర్మాణం పూర్తయిన తర్వాత అప్రోచ్ రోడ్లను సిద్ధం చేయడంలో కాంట్రాక్టర్లు చేతులెత్తేశారంటున్నారు. ఒక దశలో అధికారులు కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేసినప్పటికీ చేసిన పనుల తాలూకు ఎంబీ రికార్డు చేసి తమకు బిల్లులు చెల్లించి మిగతా కాంట్రాక్ట్ పనిని వేరే వాళ్లకు అప్పగించారని కాంట్రాక్టర్లు ఖరాకండిగా చెబుతున్నట్లు తెలిసింది.

రాకపోకలకు తీవ్రంగా ఇబ్బంది కలుగుతోంది...

● మంత్రరాజం సురేష్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్, ఖానాపూర్



రెంకోని వాగుపై రెండు వంతెనలు నిర్మించి రోడ్లు వేయడంలో జాప్యం చేస్తున్నారు. దీంతో ప్రమాదకరంగా ఉన్న ఈ అప్రోచ్ రోడ్లపై ప్రయాణించడం ఇబ్బందికరంగా మారింది. అదమరిచి డ్రైవింగ్ చేస్తే వాహనం పైనుంచి కింద పడిపోయే పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి త్వరగా రోడ్డుపనులను పూర్తి చేయాలి.

కాంట్రాక్టర్లకు నోటీసులు ఇచ్చాం...

● మసూద్ ఆర్అండ్‌బీ డీఈఈ, ఖానాపూర్

రెండు వంతెనల తాలూకు నిర్మాణాలు పూర్తయ్యాయి. అప్రోచ్‌రోడ్ల నిర్మాణం ఇంకా మిగిలి ఉంది. త్వరగా పూర్తిచేయాలని ఇదివరకే కాంట్రాక్టర్లకు నోటీసులు ఇచ్చాం. పెండింగ్ బిల్లులను చెల్లించాలని ప్రభుత్వానికి సైతం నివేదిక పంపించాం. త్వరలోనే రెండు వంతెనల వద్ద అప్రోచ్ రోడ్ల నిర్మాణం పూర్తిచేస్తాం.

రేపు ముథోల్ నియోజకవర్గ కాంగ్రెస్ సమావేశం



డా.కాశీనాథ్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

భైంసా, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియలో భాగంగా మంగళవారం భైంసాలో ముథోల్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ సమావేశం ఏర్పాటు చేసినట్లుగా మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జీ బోస్లే నారాయణ రావ్ పాటిల్ వెల్లడించారు. ఆదివారం స్థానికంగా విలేకరులతో మాట్లాడి వివరాలు వెల్లడించారు. పట్టణ పరిధిలోని గౌరిశంకర్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం ప్రారంభం కానుందని తెలిపారు. సంబంధిత సమావేశంలో పార్టీ జిల్లా నూతన అధ్యక్షుని ఎన్నిక కోసం గాను కార్యకర్తల అభిప్రాయ సేకరించడం జరుగుతుందని పేర్కొన్నారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఎమ్మెల్యే డా.అజయ్ సింగ్ పరిశీలకులుగా రానున్నారని పేర్కొన్నారు. పరిశీలకుని సమక్షంలో కార్యకర్తల అభిప్రాయాల సేకరణ ప్రక్రియ కొనసాగనుందని వివరించారు. నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ అన్ని విభాగాల శ్రేణులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నామినేటెడ్ సంస్థల కార్యవర్గ ప్రతినిధులు సకాలంలో హజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ జిల్లా నూతన అధ్యక్షుడి ఎన్నికకు సంబంధించి అభిప్రాయాలను తెలియచేయాలని కోరారు. ఇటీవల మాతృవియోగం పొందిన భైంసా ఏరియా ఆసుపత్రి సూపరింటెంట్ డా.కాశీనాథ్‌ను ముథోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ పరామర్శించారు. ఆదివారం మధ్యాహ్నం స్థానిక నర్సింహనగర్ కాలనీలో నివాసముంటున్న సూపరిండెంట్ డా.కాశీనాథ్ నివాస గృహానికి వెళ్లిన మాజీ ఎమ్మెల్యే పాటిల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు శంకర్ చంద్రే, గంగారెడ్డి, చంద్రకాంత్, అట్టల్ దేవిదాస్‌లతో కలిసి వెళ్లి పరామర్శించారు.

ప్రమాదవశాత్తు ఒకరి మృతి

కుభీర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చొండి గ్రామానికి చెందిన షేక్ ఖాసీం (28) అనే యువకుడు ప్రమాదవశాత్తు మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన ప్రకారం.. ఖాసీం పశువుల కాపరిగా పని చేస్తున్నాడు. శనివారం పశువుల కోసం వెళ్లినప్పుడు వాగు దాటుతున్న క్రమంలో లోతు ఎక్కువగా ఉండడంతో వాగులో పడి పోగా ఈత రాకపోవడం కారణంగా ప్రమాదవశాత్తు మునిగి చనిపోయినట్లు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు



ఉత్సవాలలో మాట్లాడుతున్న ఇందూర్ విభాగ్ కళాశాల విద్యార్థి ప్రముఖ్ ఉల్లెంగ ముత్యం

కుంటాల, అక్టోబరు, 12 : (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రం కుంటాలలో ఆదివారం ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ ఇందూర్ విభాగ్‌కళాశాల విద్యార్థి ప్రముఖ్ ఉల్లెంగ ముత్యం పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యక్తి నిర్మాణం ద్వారానే జాతి నిర్మాణం తద్వారా దేశ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. దేశంలో ఉన్న సమస్యలను విదేశీ ప్రభావాలను గమనించిన డాక్టర్ హెగ్డేవార్ వ్యక్తి నిర్మాణం ద్వారా ఈ దేశంలో జాతి నిర్మాణాన్ని సాధించవచ్చు అనే లక్ష్యంతో 1925 విజయదశమి రోజున రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘాన్ని ప్రారంభించారని అన్నారు. గత వంద సంవత్సరాలుగా సంఘం సాధించిన విజయాల గురించి వివరించారు. కార్యక్రమంలో జుట్టు సుధాకర్, వంగల సుధాకర్, కొత్తకాపు నారాయణతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

సదర్మాట్ చేపల జాతర

● ఆదివారం కావడంతో చేపల కోసం భారీగా జనం ● ప్రమాద హెచ్చరిక ఉన్నా ఆగని వేట



ఆదివారం ఉదయం సదర్మాట్ ఆనకట్ట వద్ద చేపల కోసం గుమిగూడిన జనం



ఆనకట్ట తీరంలో చేపలు విక్రయిస్తున్న మత్స్యకారులు

ఖానాపూర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదమని తెలిసినప్పటికీ ఎలాగైనా సరే గలగల పారే నీటిలో వల వేసి ఉరికేచేపను పట్టుకొని నాలుగు రాళ్ల పోగేసుకోవాలని తద్వారా తమ జీవనాన్ని కొనసాగించాలనే జీవనపోరాటం కొందరిదైతే... ఆ మత్స్యకారుల వలకు చిక్కిన చేపను దక్కించుకొని తాజా చేపలను ఆరగించాలనే ఆరాటం మరికొందరిది.... ఈ ఇరువర్గాల జీవన పోరాటం... చేపల ఆరాటం వెరసి ఖానాపూర్ మండలంలోని మేడంపల్లి అడవుల్లో గల అతి పురాతన ఆనకట్ట అయినా సదర్మాట్ వద్ద జన జాతర చోటు చేసుకుంది. ఎస్సారెస్పీ నుంచి వచ్చే వరద నీరు కాస్త తగ్గుముఖం పట్టడంతో ఆదివారం ఉదయం సదర్మాట్ వద్ద చేపలను వేటాడేందుకు వచ్చిన మత్స్యకారుల పంట పండింది. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనకట్టలో సుమారు 40 నుంచి 50 క్వింటాళ్ల వరకు చేపలను పట్టారు. కాగా సదర్మాట్ వద్ద చేపలు విరివిగా లభిస్తున్నాయనే ప్రచారం ఊపందుకోగానే ఖానాపూర్ మండలంలోని మేడంపల్లి, సుర్జాపూర్, మస్కాపూర్, బాదనకుర్తి, ఖానాపూర్, తర్లపాడ్, సత్తెనపల్లి తదితర గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున సదర్మాట్ ఆనకట్ట వద్దకు చేరుకున్నారు. సదర్మాట్ ఆనకట్ట పైకి వెళ్లకుండా గేట్లకు వేసిన తాళాలు ఇటు జనాన్ని గాని అటు మత్స్యకారులను గాని ఆనకట్ట పైకి వెళ్లకుండా అడ్డుకోలేకపోయారు. గేట్ల పైనుంచి దూకి ఆనకట్ట పైకి కొందరు వెళ్లగా రక్షణగా ఏర్పాటు చేసిన ఇనుప జాలీల పైనుంచి దూకి మరికొందరు ఆనకట్ట పైకి వెళ్లారు. జనం ఉప్పెన లాగా తరలిరావడంతో చేసేదేమీ లేక సదర్మాట్ అధికారులు చేతులెత్తేశారు. నిన్న మొన్నటి వరకు సదర్మాట్ వైపు ఎవరిని వెళ్లకుండా కాపాడిన పోలీసులు, అధికారులు ఈ చేపల వేటతో సదర్మాట్ వద్ద నెలకొన్న జనసందడిని మాత్రం నిలువరించలేకపోయారు. సదర్మాట్ వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాటు చేసి గోదావరిలో వరద ఉధృతి మరింత తగ్గే వరకు రక్షణ చర్యలు చేపడితే బాగుంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

మొక్కజొన్నకు ప్రభుత్వ మద్దతు ధర దక్కేనా..?

● సగానికి పైగా ప్రైవేట్‌కే అమ్ముకున్నరైతులు
● ఇంకా ప్రారంభం కాని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు
● మద్దతు ధర లేక భారీ నష్టం



చామన్‌పెల్లి - చింతల్‌చందా గ్రామాల మధ్య ఆరబోసిన మొక్కజొన్న


లక్ష్మణచాంద, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : మొక్కజొన్న పంటకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర దక్కుతుందో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ వర్షాకాల సీజన్‌లో జిల్లా మొత్తం మీద దాదాపు 45 వేల ఎకరాలలో మొక్కజొన్న పండించగా సుమారుగా 11 లక్షల 25 వేల క్వింటాళ్ల దిగుబడి వచ్చినట్లు అధికారుల అంచనా. అయితే మండలం మొత్తం మీద దాదాపు 2,200 ఎకరాలలో మొక్కజొన్న పంట పండించగా 55,000 క్వింటాళ్ల మొక్కజొన్న దిగుబడి వచ్చింది. కాగా ఈ దిగుబడిలో సుమారు 60 శాతం అంటే 33,000 వేల క్వింటాళ్ల మొక్కజొన్నను గతిలేక దళారులకు అమ్మేశారు. జిల్లా మొత్తం మీద లెక్కగడితే దాదాపు 6 లక్షల 75 వేల క్వింటాళ్లు ప్రైవేట్‌కే అమ్మేశారు. ప్రభుత్వ మద్దతు ధర 2,400 లు కాగా ప్రైవేట్ వ్యాపారులు ఇస్తున్న ధర 2,000లకు మాత్రమే అంటే దాదాపు 11 కోట్ల రూపాయలు రైతులు నష్టపోయినట్లు మనకు అర్థమవుతోంది. కాబట్టి ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రభుత్వ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరపై కొనుగోలు చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు. తద్వారా మిగతా రైతులైనా నష్టపోకుండా ఉంటారని వారు పేర్కొంటున్నారు.

ఇంకా ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు...

తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు 2,400 ప్రభుత్వ మద్దతు ధరతో మొక్కజొన్నను కొనుగోలు చేస్తామని ఇటీవలే ప్రకటించడంతో రైతుల మనసులలో ఆశలు చిగురించాయి. అకాల వర్షాలకు ఎంతో నష్టపోయిన మాకు మంత్రి మాటలు లాభం చేకూరుస్తాయని ఆనందపడ్డారు. కాని ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు విషయంలో ఎలాంటి ముందడుగు వేయకపోవడంతో ఆ ఆశలన్నీ ఆవిరయ్యే పరిస్థితి నెలకొందని అంటున్నారు.

మాటల ప్రభుత్వమే తప్పా, చేతల ప్రభుత్వం కాదు

● గాండ్ల చిన్నయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు



కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వమే తప్పా చేతల ప్రభుత్వం కాదు. ఈ ప్రభుత్వానికి ఒక ప్రణాళిక లేదు. రైతుల పట్ల ప్రేమ కూడా లేదు. 60 శాతం మొక్కజొన్న అమ్ముకున్న తరువాత కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామనటం సిగ్గుచేటు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే కోట్లాది రూపాయలు రైతులు నష్టపోయారు.

16 వేలకు పైగా నష్టపోయాను

● ఏలేటి ప్రశాంత్ రెడ్డి



అకాల వర్షాలకు పంటలు నష్టపోగా 40 క్వింటాళ్ల మొక్కజొన్న మాత్రమే దిగుబడి వచ్చింది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవటంతో ప్రైవేట్ దళారులకు క్వింటాల్‌కు రూ. 2,000ల చొప్పున అమ్మాను. దీని ద్వారా రూ. 16 వేలు నష్టపోయాను. ఒక్కో క్వింటాల్‌కు 3.3 కిలోల చొప్పున తరుగు తీస్తున్నారు. దీని ద్వారా మరో 132 కిలోలు నష్టపోయా అంటే రూ. 2,640 నష్టపోయాను. అంటే నా మొత్తం నష్టం రూ. 18,640. నాలాగే చాలా మంది రైతులు నష్టపోయారు. కాబట్టి త్వరలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు, సోయాబీన్ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నాం.

నాలుగు రోజుల్లో ప్రభుత్వ మొక్కజొన్న కేంద్రాలు ఏర్పాటు చేస్తాం...

● సాదు ప్రవీణ్ రెడ్డి, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్

కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నాం. వీలైనన్ని ఎక్కువ ప్రాంతాలలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం. ప్రభుత్వ ఆదేశానుసారం మరో నాలుగు రోజుల్లో ఈ కేంద్రాలను ప్రారంభిస్తాం. రైతులు తమ పంటలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో విక్రయించి మద్దతు ధర పొందాలని కోరుతున్నాం.



తలమడుగులోని చర్చి కాలనీవాసులకు మంజూరు పత్రాన్ని అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

చర్చి కాలనీలో కల్వర్టు నిర్మాణానికి రూ.ఆరు లక్షల నిధులు

తలమడుగు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చర్చి కాలనీలు గత పది సంవత్సరాలుగా వరద నీటితో ఇబ్బందులు పడుతున్నారని ఇబ్బందులు తొలగించేందుకు రోడ్డు సమీపంలో కల్వర్టు నిర్మించేందుకు రూ.ఆరు లక్షలు మంజూరు అయ్యాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రకాష్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కాలనీ మొత్తం వరద నీటితో మునిగిపోయాయని, ఈ విషయాన్ని మాజీ జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావులకు విన్నవించడంతో కల్వర్టు నిర్మాణానికి కలెక్టర్ రూ.ఆరు లక్షల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. అనంతరం మంజూరు పత్రాన్ని కాలనీ వాసులకు అందజేశారు. దీంతో గ్రామస్థులు, కాలనీవాసులు జిల్లా అధికారులకు ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఇందులో సహకార సంఘం మండల ఉపాధ్యక్షుడు నల్ల పద్మాకర్ రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ముద్దం ఇంద్రసేనారెడ్డి, కటి పెళ్లి కాంత్ రెడ్డి, కాలనీవాసులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

వీధికుక్కలకు వింత రోగాలపై డీపీవో ఆరా

ఆదిలాబాద్(నార్నూర్), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): నార్నూర్ మండల కేంద్రంలో వీధి కుక్కలకు వింత రోగాలు అనే కథనం శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై జిల్లా పంచాయతీ అధికారి స్పందించారు. దీనిలో భాగంగా ఆదివారం డీపీవో స్థానిక గ్రామ పంచాయతీ కార్యదర్శి మోతీరాంను పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వీధి కుక్కలు గ్రామంలో లేకుండా సమస్య పరిష్కారం చేస్తామని, వాటిని పట్టుకునే వారు ఎవరు ఉన్నారు? వారు ఎక్కడ ఉంటారనేది? వారి సమాచారం కోసం జిల్లా మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్నట్లు తెలిపారు.

బజార్‌హత్నూర్‌లో గంజాయి పట్టివేత

బజార్‌హత్నూర్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): అక్రమంగా గంజాయి విక్రయిస్తూ ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డ సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై సంజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలో శనివారం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానస్పదంగా కనిపించారు. తనఖీ నిర్వహించగా కిషన్, మల్కుల వద్ద 10 గ్రాముల గంజాయి స్వాధీనపర్చుకున్నట్లు తెలిపారు. ఆ గంజాయి విలువ రూ.750 ఉంటుందని, ఈ మేరకు వారిపై కేసు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ

లోకేశ్వరం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కనకాపూర్ గ్రామానికి చెందిన సాయిలు మాతృమూర్తి గత కొద్ది రోజుల క్రితం దివంగతులయ్యారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ శాసన సభ్యుడు విఠల్ రెడ్డి ఆదివారం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. దీనిలో భాగంగా మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అంతేగాకుండా వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ భోజన్న, మాజీ సర్పంచ్ నరేష్, ఎంపీటీసీలు సాయి రెడ్డి, తోట గంగాధర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాజారెడ్డి, దేవన్న, తదితరులు ఉన్నారు.

చిరుతలకు అనువుగా బోథ్ అడవులు

● నీటి వసతితో పాటు జంతుజాలం ఉండడంతో చిరుతల సంచారం ● రాష్ట్రంలో 297 చిరుతలు.. బోథ్ అడవుల్లో 20!!

బోథ్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): బోథ్ అడవులు చిరుతలకు అనువుగా ఉండడంతో అడవులు జిల్లాలో ఎక్కడా లేని విధంగా బోథ్ అడవుల్లో 20 వరకు చిరుతలు జీవిస్తున్నాయి. అడవుల అభయారణ్యంగా పేరు ఉన్న కవ్వాల్ అడవుల్లో 19 చిరుతలు ఉన్నట్లు 2022 అటవి జంతువుల గణాంకాలను బట్టి అధికారులు నిర్ధారించారు. అయితే కడెం పరివాహక ప్రాంతం ఉండడంతో బోథ్ అడవుల్లో చిరుతలు ప్రశాంతంగా జీవిస్తున్నాయని అటవి శాఖ వర్గాల వారు పేర్కొంటున్నారు.

ఎక్కడా లేని విధంగా ఇక్కడే..

అడవుల జిల్లాలో దట్టమైన కవ్వాల్ అభయారణ్యంతో పాటు నిర్మల్ జిల్లాను ఆనుకొని ఉన్న తూర్పు కనుమలు మహారాష్ట్రలోని దట్టమైన అడవులు ఉండడం వల్ల 20 వరకు చిరుతలు సంచరిస్తున్నాయి. అయితే అటవీ శాఖ అధికారులు చిరుతల సంరక్షణకు ముందు చూపుగా చర్యలు చేపడుతుండడంతో పాటు అడవులు అభివృద్ధి కావడంతో చిరుతలు తమ సంతానాన్ని ఏడాదికేడాది పెంచుతు వస్తున్నాయి. అనధికారికంగా బోత్ అడవుల్లో 24 వరకు చిరుతలు ఉంటాయని అంటున్నారు. గత వారం రోజుల క్రితం నాలుగు పిల్ల చిరుతలను వెంటేసుకొని తిరుగుతున్న చిరుతను గమనించినట్లు స్థానికులు పేర్కొంటున్నారు.



బోథ్ అడవుల్లో కెమెరాకు చిక్కిన చిరుతలు

కడెం లోయల్లో నీటి నిల్వలు

బజార్‌హత్నూర్ మండలం మీదుగా ప్రవహిస్తూ వస్తున్న కడెం నది రెండు గుట్టల మధ్యన ప్రవహిస్తూ నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టులో నీరంతా కలుస్తున్నది. అయితే రెండు బుట్టల మధ్య లోతైనా గుంతలు ఉండడంతో వేసవి కాలం నీటి నిల్వలకు కొదువ ఉండదు. దీంతో పాటు నీటి కోసం వచ్చే జంతుజాలం చిరుతలకు ఆహారంగా లభించడంతో అక్కడే తిష్టవేసి వేసవి కాలం అంతా ఉంటాయని అటవీ శాఖ అధికారులు భావిస్తున్నారు. ఏదిఏమైనా బోథ్ అడవుల్లో తిష్టవేసిన చిరుతలు ఈ యేడాది 15 జంతువులపై దాడి చేసినట్లు అటవీ శాఖ అధికారుల రికార్డులను బట్టి తెలుస్తుంది. చిరుతలకు తోడుగా పెద్దపులి సైతం అడవుల్లో ఉండడంతో సమీప గ్రామాలవారు తమ పొలాలకు వెళ్లాలంటే జంకుతున్నారు.



వేటాడిన పశుమాంసాన్ని తింటూ..

ప్రతీ నిరుపేదకు ఇందిరమ్మ ఇల్లు

● కాంగ్రెస్ పార్టీ బోథ్ ఇన్‌చార్జి ఆడే గజేందర్

తాంసి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఇల్లు లేని నిరుపేదలందరికీ రేవంత్ రెడ్డి సర్కార్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణం చేపడుతుందని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ అన్నారు. ఆదివారం మండలంలోని కప్పర్ల గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను ఆయన పరిశీలించారు. ఇప్పటి వరకు ఏమేరకు నిర్మాణాలు పూర్తి అయ్యాయో సంబంధిత నాయకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారుల దగ్గరికి వెళ్లి నాణ్యత ప్రమాణాలు ఎలా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇంటి నిర్మాణంతో నిరుపేదల ఇంటి కల నెరవేరుతుంది అన్నారు. బోథ్ నియోజకవర్గంలో మూడు వేల ఇళ్లను నిర్మిస్తున్నామని ప్రతీ ఇంటిని సంబంధిత నాయకులు, కార్యకర్తలు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ లబ్ధిదారులకు సహకరించాలన్నారు. ముఖ్యంగా మంజూరైన ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనతో ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. ఇంటిని నిర్మించుకునే ప్రతీఒక్కరికి ఇల్లును మంజూరు చేసే బాధ్యత తీసుకుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ నారాయణ, కౌడాల సంతోష్, కృష్ణారెడ్డి, ప్రభాకర్, అరుణ్, లింగారెడ్డి తదితరులు ఉన్నారు.



కప్పర్లలో ఇందిరమ్మ ఇంటిని పరిశీలిస్తున్న ఆడె గజేందర్, కాంగ్రెస్ నాయకులు

● ఓటు చోరీతోనే బీజేపీకి అధికారం

నేరడిగొండ: ఓటు చోరీతోనే కేంద్రంలో బీజేపీ అధికారం దక్కించుకుంటోందని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడె గజేందర్ అన్నారు. ఆదివారం ఆయన నేరడిగొండ మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో సంతకాల సేకరణ ప్రచార కార్యక్రమాన్ని ఆడె గజేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ఓటు చోరీని ప్రజలకు స్పష్టంగా వివరించాలని పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. అలాగే ఓటు చోరీని ఆపి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఓటు సంతకాల సేకరణ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తమ తమ డిక్లరేషన్ను సంతకాల ద్వారా తెలియజేయాలని ఆయన పేర్కొన్నారు. ప్రజలను సైతం చైతన్యపరిచి ఈ ఓటు చోరీపై సంతకాలను సేకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, సీనియర్ నాయకులు ఆడె వసంత్ రావ్, రాజశేఖర్ రెడ్డి. మందుల రమేష్, కోటేశ్వర్, మురళీ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి.. వైద్య సేవలు!

(5వ పేజీ తరువాయి...)



శ్యామ్‌పూర్ పీహెచ్‌సీ

లేకపోవడంతో గిరిజన గూడాలలో అంటు వ్యాధులు సంక్రమించగానే మరణాలు సంభవించేవి. ప్రస్తుతం వైద్య సైవలు గిరిజన గ్రామాల ప్రజలకు అం దుబాటులోకి వచ్చాయి. వైద్య సిబ్బందితో పాటు గ్రామీణ ప్రాంతాలలో ఉన్న ఆశవర్కర్ల సేవలతో ఆదివాసీ గిరిజనులకు వైద్యం అందుతుంది. వైద్యశాఖ సిబ్బంది ప్రతీ శుక్రవారం నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల ద్వారా గిరిజనులలో చైతన్యం కనిపిస్తుంది. గతంలో మాదిరిగా పరిసరాలను అపరిశుభ్రంగా ఉంచుకోకుండా పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు కలుషిత నీరు తాగకుండా వ్యవసాయ పనులకు వెళ్లినప్పుడు తమ వెంట స్వచ్ఛమైన నీరు తీసుకు వెళ్తున్నారు. అంతేకాకుండా అందుబాటులోకి వచ్చిన సమాచార వ్య వస్థతో అంటు వ్యాధులు ప్రబలిన వెంటనే సమీపంలో ఉన్న ఆరోగ్య కేంద్రాలకు తరలివెళ్లడంతో పాటు అందుబాటులో ఉన్న ఆశావర్కర్ల ద్వారా ప్రథమ చికిత్సలు అందుకుంటున్నారు. ఆదివాసీ సంఘాల నాయకులు సైతం తమ తమ గిరిజన గ్రామాలలో అంటు వ్యాధులు ప్రబలినప్పుడు సాటి గిరిజనుల ను అప్రమత్తం చేస్తూ ఆరోగ్య సేవలు అందుకునేలా కృషి చేస్తున్నారు.

సత్ఫలితాలను ఇస్తున్న ర్యాపిడ్ ఫీవర్ సర్వే

జిల్లా కలెక్టర్ రాజార్షి షా, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా ఆదేశాల మేరకు అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి(ఏజెన్సీ) డాక్టర్ కుడిమెత మనోహర్ ఆధ్వర్యంలో ఏజెన్సీ ప్రాంతాల వైద్య సిబ్బంది, డాక్టర్లు గత మూడు నెలలుగా నిర్విరామంగా గ్రామీణ ప్రాంతాలలో ప్రతీరోజు రాపిడ్ ఫీవర్ సర్వే బృందాలను గ్రామాలకు పంపుతున్నారు. అంతేగాకుండా ఇంటింటికీ తిరిగి ఎవరైనా వ్యాధులతో బాధపడుతున్నారా? అని తెలుసుకుంటూ గ్రామాలలో వైద్యశిబిరాలు నిర్వహించి మందులు అందిస్తున్నారు. 32 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గత మూడు నెలల కాలంలో 6,243 వైద్య శిబిరాలు గ్రామాల్లో ఏర్పాటు చేసి 43,9167 మందికి వైద్య సేవలు అందించారు. అంతేకాకుండా 15,881 మంది జ్వరపీడితులకు వైద్య సేవలు అందించడంతో పాటు రక్త నమూనాలు తీయించి వైద్య పరీక్షలు నిర్వహించారు. 1,1041 మందికి ఆర్డి కిట్ల ద్వారా రక్త పరీక్షలు నిర్వహించి డెంగ్యూ, మలేరియా లాంటి కీటక జనిత వ్యాధులతో బాధపడుతున్నారా? అని తెలుసుకున్నారు. అలాగే, 2,313 మంది డయేరియా బాధితులకు ఆరోగ్య సేవలు అందించారు. గత జూలై నుంచి నిర్వహించిన రాపిడ్ ఫీవర్ సర్వే కార్యక్రమాల ద్వారా లక్షలాది మందికి జ్వరాలు సోకినప్పటికీ సరైన విధంగా వైద్యం అందించడం ద్వారా ఎక్కడ ఎలాంటి మరణాలు సంభవించకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు.

క్షణికావేశంతో పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య



కాడారి వినోద్ (ఫైల్)

నేరడిగొండ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): క్షణికావేశంతో పురుగుల మందు తాగి యువకుడి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ఇమ్రాన్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన కాడారి వినోద్(23) ఫర్టిలైజర్ షాప్‌లో పని చేస్తున్నాడు. గత నాలుగు రోజుల నుంచి పనికి వెళ్లక పోవడంతో తల్లిదండ్రులు ఎందుకు పనికి వెళ్ల లేదని మంద లించారు. దీంతో ఆదివారం ఉదయం 10 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి ఎవరికీ తెలియకుండా ఇంట్లో నుంచి వెళ్ళిపోయాడు. తండ్రి కాడారి రవి ఫోన్ చేయగా ఫోన్ లేపకపోవడంతో అనుమానం వచ్చి తన చిన్న కొడుకు కాశారి వికాస్‌ను వెంట తీసుకుని వ్యవసాయ భూమికి వెళ్లి చూడగా.. పత్తి పంటలో చేనులో వినోద్ కిందపడి ఉండడంతో వెంటనే 108లో బోథ్ ప్రభుత్వ ఆసుపత్రి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. సంఘటన స్థలంలో మోనోసిల్)పురుగుల మందు డబ్బాతో పాటు చిన్న కూల్‌డ్రింక్ డబ్బా పడి ఉండడంతో పురుగుల మందు తాగి మృతి చెందాడని పంచనామా అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఇమ్రాన్ అన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

నిర్మల్ రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని జుమ్మెరాత్‌పేట్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 2008-09వ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని ఆర్ఆర్ గార్డెన్స్‌లో జరిగింది. ఈ సందర్భంగా సరస్వతి మాత ఫోటోకు పూలమాలలు వేసి, ఉపాధ్యాయులను శాలువాలు, మొమెంటోలతో సత్కరించడం జరిగింది. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ... విద్యార్థులతో ఉన్న ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అలాగే విద్యార్థులు ఉపాధ్యాయులతో ఉన్న అనుభవాలను పంచుకున్నారు. అలాగే తోటి మిత్రులతో ఆనాడు చేసిన చిలిపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

జిల్లా కేంద్రంలో పీసీసీ పరిశీలకుల పర్యటన

నిర్మల్ రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) :జిల్లా కేంద్రంలో పీసీసీ పరిశీలకుల పర్యటన ఉందని డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు ఆదివారం తెలిపారు. నూతన జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుల ఎంపిక నేపథ్యంలో ఏఐసీసీ ఆదేశాల మేరకు నిర్మల్ జిల్లా పరిశీలకులు అజయ్ సింగ్, పీసీసీ పరిశీలకులు, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, మిద్దెల జితేందర్, జిల్లా కో-ఆర్డినేటర్ సిహెచ్. రామ్‌భూపాల్, లాకావత్ ధనవతి, గడ్డం చంద్రశేఖర్ రెడ్డిలు సోమవారం జిల్లా కేంద్రంలో పర్యటిస్తారని డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు తెలిపారు. మంజులాపూర్ రోడ్డులోని మారుతి ఇన్ హోటల్‌లో మధ్యాహ్నం ఒంటి గంటకు మీడియా సమావేశం, 1:30 గంటలకు నిర్మల్‌బ్లాక్ సమావేశం, 2:10 గంటలకు మామడ బ్లాక్ సమావేశం అనంతరం 2:50 గంటలకు నాయకులతో ముఖాముఖి ఉంటుందన్నారు.

పెద్దమ్మ తల్లికి బోనమెత్తిన మహిళలు



బోధన్‌లో బోనాలు తీసుకెళ్తున్న దృశ్యం

ఏర్గట్ల, నవీపేట, బోధన్, అక్టోబరు 12, (ఆంధ్రజ్యోతి): ఏర్గట్లలో ముదిరాజ్ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం పెద్దమ్మ తల్లి బోనాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. గ్రామం లోని ప్రధాన వీధుల గుండా బోనాల ఊరేగింపు నిర్వహించారు. డప్పు చప్పుళ్లు, బైండ్లోళ్ల విన్యాసాల మధ్య ఊరేగింపు ఘనంగా సాగింది. గ్రామంలోని ముదిరాజ్ సంఘాల సభ్యులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

● నవీపేట మండలం దర్యాపూర్, నవీపేట, మోకన్‌పల్లి తదితర గ్రామాలలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. స్థానిక మహలక్ష్మి, పోచమ్మ, మైసమ్మ, ఇతర గ్రామ దేవతలకు పూజలు నిర్వహించారు. పాడి పంటలు చల్లగా ఉండాలని కోరుతూ మొక్కులు చెల్లించుకున్నారు.

● బోధన్ మండలం పెగడాపల్లి గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ పండుగను నిర్వహించారు. మహిళలు ఇళ్ల నుండి బోనాలు తీసుకువచ్చి ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకొని పూజలు నిర్వహించారు. గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బాణాసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి

● ఎస్పీ డా. జి.జానకిషర్మిల

నిర్మల్ రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రజల భద్రత, క్షేమం దృష్టిలో ఉంచుకొని రాబోయే దీపావళి పండుగను ప్రజలందరూ ఆనందంగా, సురక్షితంగా జరుపుకోవాలని నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి.జానకి షర్మిల సూచించారు. బాణాసంచా విక్రయాల కోసం అనుమతి తప్పనిసరి. ఎలాంటి అనుమతులు లేకుండా బాణాసంచా దుకాణాలను ఏర్పాటు చేసినా, సరైన భద్రతా ప్రమాణాలు లేకుండా విక్రయాలు జరిపినా, ప్రేలుడు పదార్థాల చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీపావళి నేపథ్యంలో బాణాసంచా తయారీదారులు, సరఫరాదారులు, విక్రయదారులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరిగే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.



ఎస్పీ జానకి షర్మిల

పాటించాల్సిన భద్రతా చర్యలు...

- దుకాణాల మధ్య కనీస దూరం పాటించాలి.
- అగ్నిమాపక పరికరాలు, విద్యుత్ పరికరాలు సిద్ధంగా ఉంచాలి.
- విద్యుత్ లైన్ల దగ్గర బాణాసంచా నిల్వచేయరాదు.
- మైనర్లు (చిన్న పిల్లలు) విక్రయంలో పాల్గొనరాదు.
- భద్రతా ప్రమాణాలు పాటించాలి

ఘనంగా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



పూజలు నిర్వహిస్తున్న మహిళలు



ఎల్లమ్మ విగ్రహాప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

కుంటాల, అక్టోబర్, 12 : (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్లూర్‌లో రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఆదివారం జరిగింది. కల్లూరు గ్రామానికి చెందిన కీర్తి శేషులు కాశగౌడ్ రాజవ్వల స్మారకార్థం వారి కుమారులు ఆలయాన్ని నిర్మించి నూతన ఆలయంలో ఆదివారం రోజు శ్రీ రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భైంసా నుంచి వచ్చిన వేద పండితుల మంత్రోశ్చరణాల మధ్య యజ్ఞం, తదితర ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో కల్లూరుకి చెందిన గౌడ సంఘం సభ్యులందరూ పాల్గొన్నారు.

స్నేహితులకు ఆర్థిక సాయం



అందకూర్ గ్రామంలో మిత్రుని పరామర్శించిన బాల్య మిత్రులు

కుంటాల, అక్టోబరు, 12 : (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అందకూర్ గ్రామానికి చెందిన వెంకటరమణ నర్సాపూర్ (జీ) హైస్కూల్‌లో 1990-91లో పదోతరగతి చదువుకున్నాడు. ప్రస్తుతం ఆయన గొంతు క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న తోటిమిత్రులు ఆదివారం అందకూర్ గ్రామంలో వెంకటరమణ ఇంటికి వెళ్లి పరామర్శించి మనోధైర్యం నింపారు. అనంతరం వారి వంతు సహాయంగా రూ. 15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పలువురు బాల్య మిత్రులు పాల్గొన్నారు.

రోడ్లపై పంటలు ఆరబోయవద్దు




పార్డి(కే)లో మాట్లాడుతున్న ఎస్సై

కుబీర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : రైతులు తమ పంటలను రోడ్లపై ఆరబోయవద్దని ఎస్సై కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పార్డి(కే)లో గ్రామస్తులు, రైతులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. తమ పంటలను రోడ్లపై ఆరోబోయడం కారణంగా రాత్రుల్లో అటువైపుగా వెళ్లే వాహనదారులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున రైతులు పంటలను రోడ్లపై ఆరబోయవద్దని సూచించారు. అదే విధంగా ఇటీవల వాట్సాప్‌లో సర్క్యూలేట్ అవుతున్న ఏపీకే యాప్ ఫైల్ ద్వారా జరుగుతున్న సైబర్ మోసాలను వివరించి, జాగ్రత్తలు సూచించారు. ఈయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఏఈపీఎస్ పరికరాల జాప్యం

● రేషన్‌డీలర్లకు రెండంచెల నష్టం



ఏఈపీఎస్ మిషన్ దృశ్యం

నర్సాపూర్(జి), అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టం (ఏఈపీఎస్), మినీ బ్యాంకింగ్ కరస్పాండెంట్ (బీసీ) పాయింట్ల కోసం దరఖాస్తు చేసుకున్న ఏజెంట్లు, ముఖ్యరేషన్ డీలర్లకు తీవ్ర నిరాశ ఎదురవుతోంది.

ప్రధాన సమస్య - ఫీజులు కట్టినా నిరాదరణ...

రేషన్ డీలర్లు సహా ఏజెంట్లందరూ ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపీపీబీ) లాదా ఇతర ఏజెన్సీలకు నిబంధనల ప్రకారం ఫీజులు చెల్లించారు. అయితే డబ్బులు చెల్లించి నెలలు గడుస్తున్నా వారికి సేవలు అందించడానికి అవసరమైన హ్యాండ్ హెల్డ్ పరికరాలు (మైక్రో ఏటీఎం, మినీ బీసీ మెషిన్లు) ఇప్పటి వరకు అందలేదు. పరికరాలు లేకపోవడంతో ఏజెంట్లు ఆదాయాన్ని కోల్పోయి ఆర్థిక ఇబ్బందుల్లో కూరుపోయారు.

రేషన్ డీలర్ల ప్రత్యేక సమస్య (డబుల్‌లాస్)

మండలంలోని దాదాపు 15 మంది రేషన్ డీలర్లకు ఈ సేవలు అందకపోవడం వల్ల వారికి పోస్ట్ ఆఫీస్ కీలకమైన ఇన్సూరెన్స్, ఫిక్స్ డిపాజిట్ (ఎఫ్‌డీ) పథకాల అమలు, నగదు లావాదేవీలు చేసుకునే అవకాశాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. ఒకవైపు డబ్బు కట్టినా పరికరం అందక, మరోవైపు ఇతర ఆదాయ మార్గాలు మూసుకుపోవడంతో వారికి రెండంచెల నష్టం వాటిల్లుతోంది.

పరికరాలు పంపిణీ చేయాలి..

● మగ్గిడి సరళ డ్వాక్రా మహిళా, అర్లీ(కే) గ్రామం



ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకుని ఫీజులు చెల్లించిన రేషన్ డీలర్లకు తక్షణమే ఏఈపీఎస్ పరికరాలను పంపిణీ చేయాలని, గ్రామీణ ప్రాంతాల మహిళలకు పోస్టల్‌సేవలు, బ్యాంకులకు వెళ్లకుండానే నగదు తీసుకునే అవకాశం ఉంటుంది.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిర్మల్‌రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గాజులపేట్ ప్రాంతంలో డీటీఆర్‌ల డబుల్ సర్క్యూటింగ్ (డబుల్ ఫీడింగ్) పనుల కారణంగా సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాయం త్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిపి వేయనున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. పనులు పూర్తయిన వెం టనే విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామన్నారు.

ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థికి సన్మానం

వేల్పూర్, అక్టోబరు 12, (ఆంధ్రజ్యోతి): వేల్పూర్‌కు చెందిన జింబరాతి నవతేజ్ కేయూలో ఎంబీబీఎస్ సీటు సాధించాడు. ఈ విషయం తెలుసుకున్న మండల బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నవతేజ్‌ను ఆదివారం శాలువతో సన్మానించారు. నవతేజ్ ఎంబీబీఎస్ పూర్తి చేసుకొని వైద్యరంగంలోనే పీజీ పూర్తిచేసి పేదలకు వైద్యసేవలు అందించాలని బీఆర్ఎస్ నాయకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రేగుల్ల రాములు, పిట్ల సత్యం, ప్రతాప్‌రెడ్డి, బోజన్న యాదవ్, మొండి అశోక్, దయాకర్, ప్రభుదాస్, సౌడ కాంతయ్య, నయిమ్, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యపు నీడలో
మున్సిపల్ ప్రత్యేక పాలన

» మినీ ట్యాంక్‌ల నుంచి వృధాగా పోతున్న నీరు » పగటి వేళల్లో సెంట్రల్ లైటింగ్ వెలుగులు


మేదరిగల్లిలో వృధాగా పోతున్న నీరు



పగటి వేళలో వెలుగుతున్న వీధి దీపాలు

భైంసా, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కేంద్రమైన భైంసాలో ప్రత్యేక పాలన నిర్లక్ష్యపు నీడలో కొనసాగుతోంది. మున్సిపల్ అధికార యంత్రాంగం అవలంబిస్తున్న అలసత్వ విధానాలకు కింది స్థాయి సిబ్బంది బాధ్యతారాహిత్య వైఖరి విధానాలు తోడవ్వడం మూలంగా పట్టణ పరిధిలో అంతటా సమస్యలే రాజ్యమేలుతున్నాయి. కమిషనర్‌తో పాటు ఇతర విభాగాల అధికారులు కార్యాలయానికే పరిమితమవుతుండటం మూలంగా పర్యవేక్షించే వారే కరువయ్యారు.ఈ క్రమంలో కింది స్థాయి సిబ్బంది ఇష్టరాజ్యంగా విధులను నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇందులో బాగంగానే మున్సిపల్ పరిధిలో నీటి సరఫరా, వీధి లైట్ల విభాగపు సిబ్బంది నిర్లక్ష్యపూరిత ధోరణి విధుల నిర్వాహణ మూలంగా ఎంతో విలువైన నీరు, విద్యుత్ దుబారా అవుతోంది. పలు కాలనీల పరిధిలో ఏర్పాటు చేసిన మినీ వాటర్ ట్యాంక్‌లు నిండుకపోయి వాటి నుంచి రోజుల తరబడి నీరు వృధాగా పోతున్న నియంత్రించే వారులేకుండా పోయారు.ఇక మున్సిపల్ విద్యుత్ విభాగపు సిబ్బంది సాయంత్రం వేళలో వీధి లైట్లను వేసి ఉదయం పూట వాటిని అర్పివేసే చర్యలను విస్మరిస్తున్నారు. దీంతో ఎంతో విలువైన విద్యుత్ భైంసా మున్సిపల్ పరిధిలో దుబారా అవుతోంది. ఇక్కడి మున్సిపల్ ప్రత్యేకాధికారిగా నున్న జిల్లా అదనపు కలెక్టర్ పై జాన్ ఆహ్మద్ పని ఒత్తిడితో పర్యవేక్షణ చేపట్టకపోవడాన్ని అసరగా తీసుకుంటున్న అధికారులు,సిబ్బంది ఇష్టరాజ్యంగా విధులు నిర్వహిస్తుండటంతో విలువైననీరు,విద్యుత్ దుబారా అవుతోందని సర్వత్రా విమర్శలు గుప్పిస్తున్నారు.

నేడు అంతర్జాతీయ విపత్తు నివారణ దినం

» జాగ్రత్తే మన బలమైన కవచం
» నేడు అంతర్జాతీయ ప్రకృతి వైపరీత్యాల నివారణ దినోత్సవం

ముథోల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రతి సంవత్సరం అక్టోబరు 13న అంతర్జాతీయ ప్రకృతి వైపరీత్యాల నివారణ దినోత్సవంగా ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటారు. ఈ దినోత్సవం ప్రకృతి విపత్తుల ప్రభావాన్ని తగ్గించడం, ముందస్తు జాగ్రత్తలు,సేఫ్టీ మానవీయత,అవగాహన పెంపొందించడం కోసం ప్రత్యేకంగా కేటాయించబడింది. భూకంపాలు, వరదలు, తుఫానులు, అగ్నిప్రమాదాలు, కరువులు వంటి ప్ర కృతి విపత్తులు మానవ జీవితాన్ని, వ్యవసాయాన్ని, పర్యావ రణాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్న నేపథ్యంలో ఈ దినో త్సవం మరింత ప్రాముఖ్యత పొందింది. దీనికి అద నంగా తరచుగా మానవ ప్రభావిత విపత్తులయిన సాంకే తిక, పారిశ్రామిక ప్రమాదాలు,ఉగ్రవాదం వంటి కారకాల వల్ల సంభవిస్తుంది. విపత్తులను నియంత్రించ డానికి విపత్తు ప్రమాదాన్ని తగ్గించుటకే అంత ర్జాతీయ దినోత్సవం 1989లో ప్రారంభిం చబడింది.ప్రమాద- అవగాహన, విపత్తు తగ్గింపు సంస్కృతిని ప్రోత్సహించడానికి ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ పిలుపునిచ్చాకా 2009లో అధికారికంగా అక్టోబరు 13ను ప్రపంచ విపత్తు నియంత్రణ దినంగా జరుపు తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజలు, సమాజాలు విప త్తులకు గురికావడాన్ని ఎలా తగ్గిస్తున్నాయో, వారు ఎదు ర్కొంటున్న నష్టాల ప్రాముఖ్యత గురించి అవగాహన పెంచుకోవడానికి కార్యక్రమాలు జరుపు తారు.



అంతర్జాతీయ ప్రకృతి విపత్తు లోగో

ప్రకృతి వైపరీత్యాలను అడ్డుకునే మార్గాలు...

వాతావరణ మార్పులు పెరుగుతున్నది. విపత్తుల తీవ్రత కూడా అధికమవుతోంది. అందుకే ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, భద్రతా ప్రణాళికలు, పర్యావరణ పరిరక్షణ, చెట్ల పెంపు వంటి చర్యలు ప్రతి దేశంలోనూ అత్యంత కీలకమని హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వం, స్థానిక సంస్థలు, పౌరుల పాత్ర తెలంగాణలో ప్రతి ఏడాది వర్షాకాలంలో గాలి వానల కారణంగా మానవ, ఆర్థిక నష్టాలు జరుగుతున్నాయి. అధికారులు చెబుతున్నట్టు ప్రభుత్వం ముందస్తు సిద్ధతతో ఉంటే, ప్రజలు అప్రమత్తత పాటిస్తే నష్టాలను గణనీ యంగా తగ్గించవచ్చు. నిర్మల్ జిల్లాలోని ఆయా గ్రామాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్ర మాలు నిర్వహించడం, పాఠశాలలో విపత్తు నిర్వహణ శిక్షణలు ఇవ్వడం, స్థానిక విపత్తు రెస్పాన్స్ బృందాలను బలోపేతం చేయడం వంటికార్యక్రమాలు చేశారు.

ప్రకృతి రక్షణ - మన భవిష్యత్తు రక్షణ...

ప్రకృతి మన స్నేహితురాలు, కానీ దానిని నిర్లక్ష్యం చేస్తే ప్రమాదం తప్పదు. చెట్ల నరికివేత, పర్యావరణ కాలుష్యం, వనాలు కత్తిరించడం వంటి చర్యలు భూమిని ప్రమా దంలోకి నెట్టుతాయి. ప్రతి పౌరుడు 'ప్రకృతి భద్రత అంటే నా బాధ్యత' అనే ధ్యేయంతో ముందుకు రావాలని నిపుణులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంలో వృక్షారోపణ, నీటిని సురక్షితంగా వాడటం, రిసైక్లింగ్, అవశేషాల సముచిత నిర్వహణ వంటి చర్యలు ప్రతి కుటుంబం చేయాల్సిన అవసరం ఉంది. చిన్న చిన్న చర్యలే పెద్ద ఫలితాలను తీసుకొస్తాయని విపత్తు నిర్వహణ శాఖ అధికారులు చెబుతున్నారు.

జాగ్రత్తలు, అవగాహన - అత్యంత కీలకం

ప్రతీ సంవత్సరం ఈ దినోత్సవంలో స్కూల్, కాలేజీలు, పల్లెలు, పట్టణ ప్రాంతాల్లో అవగాహన, శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్నాయి. వృద్ధులు, చిన్న పిల్లలు, రైతులు, వ్యాపారస్తులు ప్రతీ వర్గం ఈ కార్యక్రమంలో భాగమవుతున్నారని అధికారులు తెలి పారు. ఇటీవలనే జిల్లాలోని పలు గ్రామాల్లో సంబంధించిన అధికారులు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరి సహకారమే మన భద్రతకు మూలం అని రాష్ట్ర విపత్తు నిర్వ హణ అధికారులు తెలుపుతున్నారు. అక్టోబరు 13న జరుపుకునే అంతర్జాతీయ ప్రకృతి వైపరీత్యాల నివారణ దినోత్సవం మానవ జీవితాలను రక్షించడానికి, పర్యావరణ పరి రక్షణకు, విపత్తుల నుంచి సురక్షిత భవిష్యత్తు నిర్మాణానికి ప్రేరణగా మారింది. ప్రజలు, ప్రభుత్వాలు, స్థానిక సంఘాలు కలిసి చర్యలు తీసుకుంటే ప్రకృతి విపత్తులను అడ్డుకో వడం అసాధ్యమేమికాదు.

ఆర్‌టీఐ సామాన్యుడి చేతిలో తిరుగులేని ఆయుధం

» ఆర్‌టీఐకి 20 ఏళ్లు » పౌరుడి బ్రహ్మాస్త్రం » అక్రమాలకు ఇక తావు లేదు


జాదవ్ మోతిలాల్ పటేల్

నర్సాపూర్(జి), అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ- 2005) అమలులోకి వచ్చి నేటికి సరిగ్గా రెండు దశాబ్దాలు (20 సంవత్సరాలు) పూర్తయ్యింది. 2005 అక్టోబరు 12న అమలు లోకి వచ్చిన ఈ చారిత్రక చట్టం, ప్రభుత్వ వ్యవహారాల్లో పారదర్శకత, జవాబుదారీతనాన్ని సాధిం చడానికి పౌరులు సుదీర్ఘంగా పోరాడి గెలుచు కున్న హక్కు. ఈ చట్టం పుట్టుక రాజస్థాన్‌లోని కూలీల వేతనాల వివాదం నుంచి మొదలై, అరుణా రాయ్ వంటి కార్యకర్తల నేతృత్వంలో జరిగింది. చట్టం ఆమోదం పొందేనాటికి కేంద్రంలో డా. మన్మోహన్‌సింగ్ ప్రధానిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోవైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నారు.

ఆర్‌టీఐ సామాన్యుడి చేతిలో తిరుగులేని ఆయుధం

ఆర్‌టీఐచట్టం కేవలం చరిత్రకు పరిమితం కాలేదు.ఇదినేటికీ గ్రామస్థాయిలో అక్రమాలను నిలదీస్తోంది. బూరుగుపల్లి(కే) గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త జాదవ్ మోతిలాల్ పటేల్ ఈ చట్టాన్ని ఆయుధంగా వాడిన తీరు అద్భుతం. చాక్‌పల్లిగ్రామపంచాయతీ పరిధిలో జరిగిన నిధుల అవకతవకలు,పనుల్లోని నాణ్యత లోపాలను తాము ఈ చట్టం ద్వారానే బయటపెట్టగలిగామని పటేల్ తెలిపారు.

20 ఏళ్ల సందర్భంగా జాదవ్ మోతిలాల్ పటేల్ బూరుగుపల్లి(కే) గ్రామం సందేశం

సమాచారహక్కుచట్టం (ఆర్‌టీఐ)సామాన్యు డి చేతిలో ఉన్న బ్రహ్మాస్త్రం.ప్రభుత్వ వ్యవస్థలో జవాబుదారీతనం తేవడానికి, అక్రమాలను బయట పెట్టడానికి ఈ చట్టం తిరుగులేని ఆయుధం. ఆర్‌టీఐని రక్షణకవచంగా, మార్పునకు ఆయుధంగా భావించండి.

భయం లేకుం డా ప్రశ్నించి, మీప్రాంతాన్ని అభివృద్ధి చేయండి...

ఆర్‌టీఐ చట్టం రెండుదశాబ్దాలు పూర్తి చేసు కున్న ఈ సందర్భంగా ప్రతి పౌరుడు తమ హక్కును వినియోగించుకొని, ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది.

నాటుసారా తయారీకి స్వస్తి

» నాటు సారా తయారుచేస్తే లక్ష జరిమానా
» తయారీ సమాచారం ఇస్తే 10000 బహుమతి

బోథ్, అక్టోబరు12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంటేగాం, బాబేర, బిర్లాగొంది గ్రామాలలో నాటుసారా తయారీ పై ఆంక్షలు విధించారు. గ్రామంలో నాటుసారా తయారు చేయడం వల్ల యువకులు సారాకు బానిస అవుతున్నారని గమనించి గ్రామస్తులంతా నిర్ణయం తీసుకున్నారు. నాటుసారా తయారీ కట్టడి చేయడంతో గ్రామంలో నాటుసారా తాగవద్దని గ్రామస్థులు నిర్వహించుకున్నారు. దీంతో నెల రోజులుగా గ్రామంలో నాటుసారా తయారీ నిలిచి పోయింది.

తరుచు దాడులతో....

నాటుసారా తయారీ జరుగుతుందని ఎక్సైజ్ పోలీసు అధికారులు తరుచుగా దాడులు చేస్తుండడంతో గ్రామస్థులు గ్రామాల విలువ పోతుందని దీంతో ప్రభుత్వ అధికారుల దృష్టిలో చులకన అయిపోతామని భావించి నాటుసారా తయారీ పై కట్టడి చేశారు. ఎవరైనా గ్రామంలో నాటుసారా తయారు చేస్తే లక్ష రూపాయల వరకు జరిమానా విధిస్తామని నిర్ణయించారు. అంతేకాక నాటుసారా తయారు చేస్తున్నట్లు చూసి గ్రామ పెద్దలకు ఎవరైనా సమాచారం ఇస్తే పదివేల రూపాయలు బహుమతిగా ఇస్తామని తీర్మానించారు. దీంతో నాటు సారా తయారీకి బ్రేక్ పడింది.

యువకులు బానిసలుగా మారడంతో

గతంలో నాటు సారా గ్రామంలో దొరకడంతో గ్రామ యువకులు ఉదయం నుంచి నాటుసారాకు అలవాటు పడ్డారు. దీంతో యువకుల సంసారంలో చిచ్చురేగింది. మరోవైపు మద్యం మత్తులో ఏ విధంగా వ్యవహరిస్తున్నారో తెలియకుండా పోవడంతో ఇక నాటుసారా ఇదే విధంగా లభిస్తే గ్రామం తాగుబోతుల నిలయంగా మారే అవకాశం ఉందని భావించి పూర్తి స్థాయిలో నిషేదం విధించారు.

వృద్ధులు సైతం మద్యానికి దూరం

గ్రామంలో ఉండే వృద్దులు నాటుసారా తాగకుండా ఉండడంతో పాటు గ్రామంలోపల ఏ విధమైన మద్యం సేవించవద్దని నిర్ణయించుకున్నారు. పొలం పనులకు వెళ్లి వచ్చిన తర్వాత కొంత మంది రైతులు మద్యం సేవించేవారు అయితే పిల్లల సైతం పెద్దలను అనుకరించడంతో మద్యం మత్తులో ఘర్షణలకు దిగేవారు. ఈ విషయాన్ని గమనించిన పెద్దలు మద్యం తాగకుండా ఉండడమే మంచిది అని గ్రామంలో మద్యం తాగకుండా ఉంటున్నారు. మద్యం తాగిన వేరే గ్రామంలోనితాగి రావాలని అది కూడా బహిరంగంగా తాగ వద్దని నిర్ణయించుకున్నారు.


కంటేగాం గ్రామ నాయక్ యశ్వంత్

కట్టడి లేక పోతే కష్టమే

మద్యం తయారీ పై కట్టడి లేకపోతే కష్టమే అని భావించి గ్రామంలోని పెద్ద మనుషులమంతా సమావేశమై నాటుసారా తయారీ పై కట్టర్ చేశామని కంటేగాం గ్రామనాయక్ యశ్వంత్ పేర్కొన్నారు. పొలం పనులకు వెళ్లి పిల్లలు ఉన్నత చదువు లు చదివేందుకు వెళ్లేవారు మద్యానికి బానిసలుగా మారుతున్నారని అంతేకాక అనారోగ్యం బారీన పడుతున్నారని గమనించి మద్యం విక్రయాలకు బ్రేక్‌వేయాలని నిర్ణయించామన్నారు. తయారు చేస్తే జరిమానాలు అందిస్తామని పేర్కొనడంతో నాటుసారా తయారీ నిలిచి పోయిందన్నారు. తమ గ్రామంలో కాకుండా బాబేరా బిర్లాగుంది గ్రామాలలో సైతం ఈ నిర్ణయం తీసుకున్నారని ఆయన పేర్కొన్నారు.

విద్యార్థులకు పొదుపు, నిజాయతీ, సంస్కారంపై అవగాహన



పొదుపు పెట్టేలో డబ్బులు వేస్తున్న విద్యార్థి

బోథ్,అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): బోథ్ మండల కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న గిరిజన గ్రామీణ జీడిపల్లిలో నీ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న బిక్కగంగయ్య విద్యార్థులకు చదువుతో పాటు పొదుపు నిజాయితీని అలవాటు చేస్తున్నాడు.దీంతో విద్యార్థులు అబద్ధం ఆడకుండా నిజాయితీగా వ్యవహరించడంతో పాటు వృధా ఖర్చులకు దూరంగా ఉంటున్నారు.దీంతో విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలకు ఎవరైనా సందర్శకులు వచ్చిన విద్యార్థులు తల్లిదండ్రులు వచ్చిన గ్రామపెద్దలు వచ్చిన వారి వద్ద నుంచి తమ బ్యాంకులో జమ చేసేందుకు డబ్బులు అడిగి జమ చేస్తున్నారు. దీంతో విద్యార్థులకు పొదుపు పై అవగాహన కలుగుతున్నది.

చదువుతో పాటు సంస్కారం అలవాటు చేస్తున్నాం

ఆదివాసీ గిరిజన గ్రామమైన జీడిపల్లిలో విద్యార్థులకు చదువుతో పాటు సంస్కారం నేర్పుతున్నామని పాఠశాల ఉపాధ్యాయుడు బిక్కగంగయ్య పేర్కొన్నారు. పిల్లలు తమ తల్లిదండ్రులు ఇచ్చిన చేతిఖర్చు డబ్బును పొదుపు పెట్టలో వేసుకుంటున్నారని తెలిపారు. అంతేకాక పాఠశాల సందర్శన కోసం ఎవరైనా వచ్చిన గ్రామ పెద్దలు వచ్చిన విద్యార్థులు తమగల్లీ పెట్టేలో తోచినంత డబ్బు వేయాలని కోరుతున్నారు. దీంతో పాఠశాలను సందర్శించిన వారు పొదుపు పెట్టేలో డబ్బులు వేస్తున్నారని ఉపాధ్యాయుడు తెలిపారు. మరోవైపు విద్యార్థులకు నిజాయితి అలవాటు చేయాలన్న దృక్పథంతో నిజాయితి పెట్టేను సైతం ఏర్పాటు చేశామన్నారు. దీంతో విద్యార్థులకు తోటి విద్యార్థులు వస్తువు ఏదైనా దొరికిన నిజాయితీగా ఏర్పాటు చేసిన నిజాయితీ పెట్టేలో వేయడం జరుగుతుందన్నారు. దీంతో వస్తువు పోగొట్టుకున్న విద్యార్థి నేరుగా ఉపాధ్యాయుడిని వద్దకు వచ్చి తన వస్తువు పోయిందని ఎవరైనా నిజాయితి పెట్టెలో వేస్తే ఇవ్వాలని అడుగుతున్నారన్నారు. దొరికిన వస్తువు తమది కాదని విద్యార్థులకు తెలియాలన్న ఉద్దేశంతో ఈ పెట్టెను ఏర్పాటు చేశామన్నారు. ఏది ఏమైనా ఉపాధ్యాయుని తీరువల్ల విద్యార్థుల్లో పొదుపు నిజాయితీ పై అవగాహన వచ్చిందని పలువురు పేర్కొంటున్నారు.


బిక్కగంగయ్య, ఉపాధ్యాయుడు

కాలానుగుణంగా ఆహారపు అలవాట్లో మార్పు



బజార్‌హత్నూర్‌లో కవ్వాన్ని తిప్పుతున్న తులసీబాయి

బజార్‌హత్నూర్,అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి):ఓ ముప్పై ఏళ్ల వెనక్కి వెళితే.. పూర్ణం బూరె మొదలుకుని వేడి వేడి పప్పన్నం వరకు కమ్మని నేతి వాసన లేనిది ముద్ద దిగని వాళ్లే అప్పట్లో ఎక్కువ మరి. కాలానుగుణంగా కాలం మారి ఆహారపుటలవాట్లలో భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. ఫలితంగా..ఓస్సూన్ నెయ్యి లేకుండానే ఏదో రకంగా భోజనం కానిచ్చేస్తున్నారు.ఇప్పుడు మజ్జిగ, వెన్న వంటివి రెడీమేడ్‌గా మార్కెట్లో దొరుకుతున్నాయి. గోవులను ఇంటికి లక్ష్మిగా భావించే మధుర సమాజం ఎక్కువగా ఉన్న గోకొండ, భూర్కాపల్లి, ఏసాపూర్,టెంబి, చందూనాయక్ తండాగ్రా మాల్లో పాత సాంప్రదాయ పద్ధతిలో పాలలో తోడు వేసి రాత్రంతా ఉంచి తెల్లవారు జామున చిలికి వెన్న, నెయ్యిని తయారు చేస్తూ ఇప్పటికీ కనిపిస్తారు. అలా నే బజార్ హత్నూర్ మండల కేంద్రంలో పేలే తులసిబాయి అనే అవ్వ తన ఇంట్లో పాత పద్దతిలో కవ్వంతో తోడు వేసిన పాలను చిలుకుతూ ఆంధ్రజ్యోతి కంటపడింది.


అస్తమిస్తూ కనువిందు చేస్తున్న అరుణవర్ణం

ప్రపంచానికి వెలుతురునిస్తున్న సూరీడు ఉదయించే, అస్తమించే సమయంలో అరుణ కాంతులు వెదజల్లుతూ తన బింబాన్ని ప్రదర్శిస్తుంటాడు. ఈ కోవలోనే ఆదివారం సాయంత్రం సూరీడు అస్తమించే సమయంలో ఈత చెట్టుపై దీపంలా మారి వెలుతురు ఇ స్తూ అస్తమించాడు.

● (పెద్ద కొడప్‌గల్, ఆంధ్రజ్యోతి)



» బాటిల్‌పై అదనంగా రూ.20 నుంచి రూ.50 వసూలు

ఆదిలాబాద్(నార్నూర్), అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మండలంలోని చాలా గ్రామాల్లో బెల్ట్ షాపులా దందా జోరుగా నడుస్తుంది. కొన్ని గ్రామాల్లో అయితే బెల్ట్ షాపు అన్ని రకాల లిక్కర్ దరాజగ టేబుల్ మీద పెట్టి మరి అమ్ముతున్నారు. ఇంత దర్జాగా వ్యాపారం చేస్తున్న సంబంధిత ఎక్సైజ్ శాఖాధికారులు వీరిపై ఎలాంటి చర్యలు తీసుకో లేక వారు బాటిళ్లపై అధికంగా రూ.20 నుంచి రూ.50 బ్రాండ్‌ను బట్టి డబ్బులు వసూలు చేస్తున్నారు. ఒక్కప్పుడు కిరాణ షాపులో మనకు కావాల్సిన నిత్యావసర వస్తువుల దుకాణం అనిపిస్తుండే. కానీ ఈ రోజుల్లో పేరుకు కిరాణ షాపులు కనబడుతున్నాయి. వాటి ముసుగులో అంత లిక్కర్ మద్యం బాటిళ్లు అమ్ముతున్నారు. ప్రభుత్వ అధికారులు కేవలం పేరుకు గ్రామంలో పర్యటించి ఒక్కరి ఇద్దరిని కేసులు నమోదు చేస్తున్నారు. ఇంత దర్జాగా జన అవసంలో ఇలాంటి అనుమితి లేని అక్రమ మద్యం బెల్టుషాపులు నిర్వహిస్తున్న భయపడేది తగ్గేది లేదంటున్న బెల్టు షాప్ నిర్వాహకులు. వీరిపై కఠిన చర్యలు లేవా అనేది ఇప్పుడు ప్రాంత ప్రజలు హాట్ టాపిక్ చర్చలు జనాలు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బెల్టు షాపులు నిర్వహించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఉమ్మడి మండల వాసులు కోరుతున్నారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో జాన్సన్ నాయక్‌కు కీలక బాధ్యతలు

» బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తో కలిసి రెహమత్ నగర్, కార్మిక నగర్ ఇన్‌చార్జిగా నియామకం

ఖానాపూర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్‌కు పార్టీ అధిష్టానం కీలక బాధ్యతలను అప్పగించింది. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తో కలిసి జాన్సన్ నాయక్‌ను జూబ్లీహిల్స్‌లోని రెహమత్‌నగర్, కార్మిక నగర్‌లోని పలు బూత్‌లకు ఇన్‌చార్జిగా నియమించినట్లు ఆదివారం రాత్రి ఆయన ఆంధ్రజ్యోతికి ఫోన్ ద్వారా వివరించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ బాధ్యతలను తనకు అప్పగించినట్లు జాన్సన్ పేర్కొన్నారు. తనకు అప్పగించిన బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తించి పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేస్తానని జాన్సన్ నాయక్ పేర్కొన్నారు.


కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జాన్సన్ నాయక్,అనిల్ జాదవ్

లోకేశ్వరంలో కాలువల పూడికతీత

లోకేశ్వరం,అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి):లోకేశ్వరం మండల కేంద్రంలో భగీరథ చెరువు కట్ట కింద గల కాలువలలో పేకుపోయిన మట్టిని గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జేసీబీ సహాయంతో తీసివేశారు. భగీరథ చెరువు కింద గల ఆయకట్టు ఎంత ఉందో అంత వరకు నీరు చేరేటట్లు చేశారు. ఈకార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ గంగాదర్, క్యాషియర్ నగేష్, సభ్యులు పాల్గొన్నారు.


పేరుకపోయిన మట్టిని తొలగిస్తున్న జేసీబీ

శృంగేరి జగద్గురువుల విజయ యాత్ర ఏర్పాట్లపై సమీక్ష


సమీక్ష సమావేశంలో వైదిక సిబ్బంది, దేవాదాయ శాఖ అధికారి

బాసర, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): విజయ యాత్రలో భాగంగా వచ్చే నెల 17,18,19 వ తేదిల్లో బాసరకు రానున్న దక్షిణామ్నాయ శృంగేరి జగద్గురువులు శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతి మహాస్వామి పర్యటన ఏర్పాట్లను అమ్మవారి ఆలయం అధికారులు పరిశీలించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ధార్మిక సలహాదారు గోవింద హరి ఆదివారం బాసర వచ్చి సమీక్షించారు. ఈ సమావేశంలో దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్త శరత్‌పాఠక్, కార్యనిర్వహణాధికారి అంజనా దేవి, ఏఈవో సుదర్శన్‌గౌడ్, ఆలయ వైదిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఏర్పాట్లకు సంబంధించి పలు కీలక సూచనలు, సలహాలు ఇచ్చారు. పర్యటన సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుకుండా భక్తుల రద్ధిని దృష్టిలో ఉంచుకొని అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఆయన అధికారులకు ఆదేశించారు. మహాస్వామి వారి ఆగమనాన్ని ఒక చారిత్రక ఘట్టంగా భావించి, అందుకు తగ్గట్టుగా అన్ని ఏర్పాట్లు ఘనంగా వైభవంగా నిర్వహించాలని ఆయన సూచించారు. వైదిక కార్యక్రమాలు, భద్రత ఏర్పాట్లు, భక్తులకు కల్పించాల్సిన ధార్మిక సలహాదారు గోవిందహరి ఆదేశించారు.





ఏజెన్సీ గ్రామంలో ర్యాపిడ్ ఫీవర్ సర్వే బృందాల ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాల దృశ్యాలు



గిరిజన గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరం(ఫైల్)

అందుబాటులోకి... వైద్య సేవలు!

- ఉట్నూర్ ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ గిరిజనులకు మరింత చేరువలో వైద్య సేవలు
- వైద్య ఆరోగ్యశాఖ అధికారి పరిధిలో 32 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు ఏరియా ఆసుపత్రులు
- సత్ఫలితాలను ఇస్తున్న ర్యాఫీడ్ ఫీవర్ సర్వే
- కలెక్టర్‌తో పాటు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదేశాల మేరకు బృందాల పర్యటన
- గత మూడు నెలల కాలంలో మారుమూల గ్రామాల్లో 6,243 వైద్య శిబిరాల ఏర్పాటు
- 43,9167 మందికి అందిన వైద్య సేవలు

ఉట్నూర్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్రంలో అందనంత దూరంలో ఆరోగ్య సేవలు ఉండడంతో ప్రతి యేటా వర్షాకాలం నుంచి ప్రారంభమయ్యే సీజనల్ వ్యాధుల బారీన పడి మారుమూల గిరిజన ప్రాంతాల ప్రజలు అంటువ్యాధులతో మరణించేవారు. అయితే, తెలంగాణ రాష్ట్రం వచ్చాక సైతం ఉమ్మడి జిల్లాలోని ఉట్నూర్ ఏజెన్సీ ప్రాంతాలలో అంటు వ్యాధులు ప్రబలుతూ గిరిజన ప్రాంతాల ప్రజలు మరణించడంతో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం స్పందించింది. రాష్ట్ర మంత్రులను, శాసనసభ్యులను ఏజెన్సీ ప్రాంతాలకు పంపించి సత్వర వైద్య సేవలు అందించడంతో పాటు మరణాల రేటును కూడా తగ్గించాలని, అలాగే అంటు వ్యాధులతో గిరిజనులు మరణించే అవసరం లేదని పేర్కొంటూ సాక్షాత్తు అప్పటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆదేశించారు. దీంతో అధికార యంత్రాంగంతో పాటు ప్రజాప్రతినిధులు రంగంలో దిగి ఉట్నూర్‌లో స్థానికంగా ఉంటూ గిరిజన ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా కృషి చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పటిష్ట పరిచి సిబ్బందిని నియమించడంతో గిరిజన ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయంటున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అతలాకుతలంగా మారిన ఏజెన్సీ ప్రాంతాల గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిస్థితిని తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చాక చక్కదిద్దారు. 2014లో ఏర్పడిన తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంలో అంటు వ్యాధులతో మరణించే ప్రజల రేట్లు తగ్గుతూ వచ్చాయి. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ హయాంలో ఏజెన్సీ వైద్య ఆరోగ్యం కుదుట పడిందంటున్నారు. ఆ తర్వాత తెలంగాణలో మూడోసారి జరిగిన ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కూడా ఏజెన్సీ ప్రాంతాల ఆరోగ్య సేవల పరిస్థితి మెరుగ్గానే ఉందంటున్నారు. ఏజెన్సీ వైద్య ఆరోగ్యశాఖ అధికారి పరిధిలో ఉన్న 32 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు ఏరియా ఆసుపత్రుల్లో సైతం మెరుగైన వైద్య సేవలు అందించేలా కృషి చేశారు. వైద్యుల పోస్టుల ఖాళీలతో పాటు, పారామెడికల్ సిబ్బంది ఖాళీలను సైతం పూరించడంతో ఏజెన్సీ ప్రాంతాల గ్రామీణులకు ప్రభుత్వ వైద్య సేవలు మరింత అందుబాటులోకి వచ్చాయి. ఉట్నూర్ ఏజెన్సీలోని షాంపూర్, దంతన్‌పల్లి, హస్నాపూర్, నార్నూర్, ఝరి, గాదిగూడ, పిట్టబొంగరం, ఇంద్రవెల్లి, జైనూర్, సిర్పూర్(యూ), లింగాపూర్, ఆడ, తిర్యాని, కెరమెరి, రొంపల్లి, గిన్నెదరి, పెంచికల్పేట్, లోన్‌వెల్లి, దండేపల్లి, తాళ్లపేట్, మందమర్రి, వాంకిడి, కాశీపేట, ఇచ్చోడ, నర్సాపూర్(టి), బజార్‌హత్నూర్, నేరడిగొండ, భీంపూర్, గుడిహత్నూర్, సైద్‌పూర్, తదితర ప్రాంతాలలో ఉన్న పీహెచ్‌సీలలో సైతం ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి

గిరిజనుల్లో చైతన్యం.. అందుతున్న వైద్యం

గతంలో మారుమూల గిరిజన ప్రాంతాలలో ఉన్న ప్రజలు వైద్యం అందుకోలేక, సరైన తాగునీటి సౌకర్యాలు లేక, అంటు వ్యాధులపై అవగాహన

(తరువాయి 6వ పేజీలో....)

ఆశల సేవలు అమోఘం

: నైతం శోభా, ఆశా వర్కర్, నీలాగొంది



ఏజెన్సీ ప్రాంతాలలోని మారుమూల గిరిజన గ్రామాలలో కూడా ఆశవర్కర్లు ఉండడంతో గిరిజన ప్రాంతాల ప్రజలకు సేవలు అమోఘంగా అందుతున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి తమకు ఇచ్చిన మాత్రలను జ్వరాలు, దగ్గు, సర్ది, వాంతులు, విరేచనాలు సోకిన వెంటనే మందులు ఇస్తున్నాం. ఎవరికైనా అంటువ్యాధులు తీవ్రంగా ఉంటే సమీప వైద్య కేంద్రానికి తరలించి వైద్యం అందించడం ద్వారా వ్యాధులు అదుపులో ఉంటున్నాయి.

అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నాం

: డాక్టర్ సందీప్ రాథోడ్, పీహెచ్‌సీ, షాంపూర్



షాంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందిస్తున్నాం. గ్రామాలలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాం. అలాగే ప్రతీ శుక్రవారం అంటు వ్యాధులకు కారణం అయ్యే పరిస్థితులను నివారించడానికి ప్రజలకు అవగాహన కలిగించడంతో పాటు సకాలంలో వైద్యసేవలు అందిస్తున్నాం.

ఏజెన్సీ వాసుల్లో ఎంతగానో మార్పు వచ్చింది

: డాక్టర్ కుడిమెత మనోహర్, ఏడీఎంహెచ్‌వో



గతంలో గిరిజన గ్రామాలకు సరైన రహదారులు లేకపోవడంతో పాటు గిరిజనులు చాలా మంది మూఢనమ్మకాలను నమ్మేవారు. సకాలంలో వైద్యసేవలు అందక మరణాల సంఖ్య పెరిగేది. ప్రస్తుత రోజుల్లో వ్యాధులు ప్రబలిన వెంటనే వైద్యం అందుకుంటున్నారు. వైద్యసిబ్బంది సైతం వారంలో రెండు, మూడుసార్లు గ్రామాలలో పర్యటిస్తుండగా.. ప్రతీ గ్రామంలో ఆశా వర్కర్లు గిరిజనులకు అందుబాటులో ఉండి ప్రాథమిక వైద్య సేవలు అందిస్తున్నారు. అంతేగాకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహించిన ర్యాపిడ్ ఫీవర్ సర్వే కార్యక్రమాలతో ఏజెన్సీ ప్రాంతంలో మంచి ఫలితాలు వచ్చాయి.



బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు పూల బొకేను అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

జూబ్లీహిల్స్ రహమత్‌నగర్ డివిజన్ ఇన్‌చార్జిగా బోథ్ ఎమ్మెల్యే

నేరడిగొండ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): నవంబరు 11న జరిగే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భాగంగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మార్గదర్శకత్వంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని రహమత్ నగర్ డివిజన్‌లో పలు బూత్‌లకు ఇన్‌చార్జీలుగా నియమితులయ్యారు. వీరికి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇన్‌చార్జి నియామక పత్రం అందజేయగా.. కేటీఆర్‌కు వారిరువురూ పూల బొకే అందజేశారు. పార్టీ అధిష్ఠానం ఆదేశం మేరకు పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేస్తామన్నారు.

పిప్పల్‌కోటి రైతుల విషయమై సీఎంకు సీపీఎం లేఖ

భీంపూర్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): భీంపూర్ మండలం పిప్పల్‌కోటి రిజర్వాయర్‌కు సంబంధించి నిర్వాసితులైన రైతులకు తక్షణం ఎకరానికి రూ.18 లక్షల చొప్పున పరిహారం అందించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆదివారం లేఖ రాశారు. అటు పరిహారం రాక ఇటు భూములు లేక రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని ఆ లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుతం భూముల రేట్లు విపరీతంగా పెరిగిపోయాయని, వారికి న్యాయంగా రావాల్సిన పరిహారం అందించాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. తాము అధికారంలోకి రాగానే పిప్పల్‌కోటి భూ నిర్వాసితులకు పరిహారం ఇస్తామని అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, ఇప్పుడు ఆ హామీ నిలబెట్టుకోవాలని గుర్తు చేశారు. పిప్పల్‌కోటి రైతులకు న్యాయం చేయకుంటే మరిన్ని ఉద్యమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు.



నానో యూరియా పై రైతులకు అవగాహన కల్పిస్తున్న సీఈవో మోతే శ్రీనివాస్

నానో యూరియాపై తలమడుగులో అవగాహన సదస్సు

తలమడుగు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో నానో యూరియాపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈవో మోతే శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి రైతు నానో యూరియా వాడాలని కోరారు. నానో యూరియా రైతులు ఆర్థికంగా లాభం పొందవచ్చు అన్నారు. ధర తక్కువ ఉంటుందన్నారు. రవాణ ఖర్చు తగ్గుతుందన్నారు. ఇందులో నత్రజని ఉండడం వల్ల నేరుగా మొక్కకు వెళ్తుందన్నారు. ఎకరానికి ఒక బాటల్ సరిపోతుందన్నారు. దీని ప్రభావం ఎనిమిది నుంచి పది రోజుల వరకు పంటపై ప్రభావం చూపుతుందన్నారు. నానో యూరియా వాడడం వల్ల వ్యవసాయాన్ని మరింత సులభతరం చేసుకోవచ్చని సూచించారు. ఇందులో సిబ్బంది సాగర్, రమాకాంత్, ముస్తఫా, సత్యనారాయణ, బబ్లు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కేంద్రం చేసిందేమీ లేదు : రామన్న

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి చేసిందేమీ లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జోగురామన్న ఆక్షేపించారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలను తీవ్రంగా ఖండించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతు బంధు 59 లక్షల మంది రైతులకు ఇస్తే... పీఎం కిసాన్ యోజన పథకం కింద కేవలం 33 లక్షల మంది సహాయం అందించారన్నారు. పత్తిపై పదకొండు శాతం సుంకం దిగుబడిని కేంద్రం తీసేయడంతో రైతాంగం తీవ్ర అవస్థలు పడుతోందన్నారు. భారీ వర్షాలతో నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందించే విషయమై కేంద్రం నుంచి స్పందన లేదన్నారు. సమావేశంలో నేతలు మెట్టు ప్రహ్లాద్, కుమ్ర రాజు, గంగయ్య, ధమ్మపాల్, కనక రమణ, శుక్లాల్, అశోక్, భూమన్న పాల్గొన్నారు.

ఆదివాసీల హక్కుల రక్షణ కోసం పోరాడిన భీం

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ● ఉట్నూర్, నార్నూర్‌లలో కొమురం భీం వర్ధంతి ● ఎమ్మెల్యేతో పాటు నాయకుల నివాళి



వేణునగర్‌లో భీం విగ్రహం వద్ద నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్



నార్నూర్‌లో పూలమాలలు వేసి నివాళ్లర్పిస్తున్న నాయకులు

ఉట్నూర్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్కారం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న వేణునగర్‌లో ఆదివారం గోండు వీరుడు కొమురంభీం వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. వేణునగర్‌లో ఉన్న కొమురంభీం విగరహం చెంత జెండా ఎగురవేసిన అనంతరం ఎమ్మెల్యే బొజ్జుపటేల్ కొమురంభీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం సైన్యంతో ఆదివాసుల హక్కుల రక్షణ కోసం పోరాడి వీర మరణం పొందిన జోడేఘాట్ వీరుడు కొమురంభీం ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరు ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఆయన పోరాట స్ఫూర్తితో ప్రభుత్వం గిరిజనులు సాగు చేస్తున్న అడవి భూములకు హక్కుపత్రాలు ఇచ్చిందన్నారు. పోడు వ్యవసాయం చేస్తున్న గిరిజనుల భూములకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సాగునీరు అందుబాటులో తేవడానికి ఇందిరా జల సౌర విద్యుత్ పథకాన్ని అందుబాటులోకి తేవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయి, రాజాఆత్రంగంగారాం, మాజీ సర్పంచ్ మరుసుకోల తిరుపతి, సామాజిక సేవకురాలు మరుసుకోల సరస్వతి, మడావి మూతిరాం, తదితరులు పాల్గొన్నారు.

● నార్నూర్‌లో...

ఆదిలాబాద్(నార్నూర్): కుమ్రం భీం 82వ వర్ధంతిని ఏజెన్సీ గిరిజన ప్రాంతం నార్నూర్ ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఆదివాసులు సంస్కృతి సంప్రదాయాల ప్రకారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గ్రామ పెద్ద మడావి మాన్‌కు, మాజీ సర్పంచ్ బి.గజానంద్ నాయక్, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ తొడసం నాగోరావు మాట్లాడుతూ నిజాం పాలనకు వ్యతిరేకంగా జల్ జమీన్ జంగిల్ నినాదంతో కొమురం భీం ఆదివాసుల తరపున అలుపెరగని పోరాటం చేశారని ఆదివాసులకు ఆనాడే పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని కోరారని అదేవిధంగా 1/70, పెసా చట్టం అమలు చేయాలని, ఆదివాసీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని కోరుతూ ఆనాడు నిజాం పాలనకు వ్యతిరేకంగా విరచిత పోరాటాన్ని కొమురం భీం చేశారని ఆయన సేవలను కొనియాడారు.కార్యక్రమం లో ఎస్సై కె.అకిల్, రూపుదేవ్ పటేల్, హన్మంతరావు, అర్క గోవింద్, సురేష్ ఆడె, షేక్ దాదే అల్లి, సయ్యద్ ఖాసిం, లింగు, రాజు పాల్గొన్నారు.



లక్ష్మీపూర్‌లో నూతన షెడ్డును ప్రారంభిస్తున్న గోక గణేష్ రెడ్డి

ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు గొప్పవి

● మాజీ జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి

తలమడుగు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు గొప్పవని, వాటిని సంరక్షించే బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి అన్నారు. మండలంలోని లచ్చంపూర్ గ్రామంలో ఎస్టీ కాలనీలో గత కొన్ని సంవత్సరాల నుంచి అసంపూర్తిగా ఉన్న గుస్సాడీ షెడ్డుకు ఆయన రూ.50 వేల ఆర్థికసాయం చేసి పని పూర్తి చేసిన సందర్భంగా గ్రామస్థులతో కలిసి షెడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా గణేష్ రెడ్డి మాట్లాడుతూ వారం రోజుల్లో ఆదివాసీల పవిత్ర పండుగ అయినా దీపావళి పండుగకు గుస్సాడీలను ఎంతో పవిత్రంగా పూజిస్తామన్నారు. ఇందులో కాంగ్రెస్ ఎంపీటీసీ అభ్యర్థి కె.విట్టల్, స్థానిక నాయకుడు జంగు పటేల్, గ్రామ పటేల్, మాజన్, దేవారి, ఆదివాసీ మహిళలు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ పోరాట సమితి ఆవిర్భావం

ఉట్నూర్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన తరగతులకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో రిజర్వేషన్లు కల్పించే వరకు బీసీలంతా సంఘటిత పోరాటాలు చేయడానికి నిర్ణయించుకుని బీసీ రిజర్వేషన్ పోరాట సమితిని ఏర్పాటు చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని విద్యానగర్ శ్రీసరస్వతీ శిశుమందిర్ ఆవరణలో బీసీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో బీసీలంతా కలిసి బీసీ రిజర్వేషన్ పోరాట సమితిని ఖరారు చేశారు. బీసీలను అన్ని రాజకీయ పార్టీలు మోసం చేస్తున్నాయని, ఎస్సీ ఎస్టీలకు ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పిస్తున్న ప్రభుత్వాలు బీసీలకు ఎందుకు రిజర్వేషన్లు కేటాయించడం లేదో ఆలోచించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పది నియోజక వర్గాలు ఉండగా.. రెండు ఎస్సీలకు, రెండు ఎస్టీలకు కేటాయించి మిగతా స్థానాలు జనరల్ స్థానాలుగా ప్రకటించి బీసీలకు ఎందుకు రాజకీయ రిజర్వేషన్లు ఇవ్వడం లేదన్నారు. రాజకీయాలకు అతీతంగా సామాజిక న్యాయం కోసం బీసీలు ఒక్కతాటిపైకి వచ్చి బీసీలకు కూడా రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా ఉట్నూర్ బీసీ రిజర్వేషన్ పోరాట సమితి అడహాక్ కమిటీని ఖరారు చేశారు.

● 'రేపటి బంద్'ను విజయవంతం చేయాలి'

బీసీల రాష్ట్ర నాయకులు, ఎమ్మెల్సీ కృష్ణయ్య ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం రాష్ట్ర బంద్‌లో భాగంగా ఉట్నూర్ మండలం బంద్ విజయవంతం చేయాలని నూతన కన్వీనర్ సీపతి లింగాగౌడ్ కోరారు. మంగళవారం ఉదయం 6గంటల నుంచి అంబేద్కర్‌చౌరస్తాలో భారీ ధర్నా చేస్తూ వ్యాపార సంస్థలు బంద్ పాటించేలా కోరాలన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీలో కో కన్వీనర్‌గా కందుకూరి రమేష్, తోట సత్తన్న, ఒల్లెపు భుజంగరావు, సాడిగే రాజేశ్వర్, బింగి వెంకటేష్, కట్టా లక్ష్మణచారి, షికారి శ్రీనివాస్, ఘర్షకుర్తి వెంకటేష్, బొడ్డు కిరణ్, రామగిరి శ్రీనివాస్, ఆరెపల్లి రాజన్న, కాల్వరవి, నాగుల రాజేశ్వర్, పి.సూర్యకాంత్‌యాదవ్, సల్గార్ రవీందర్‌లను ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న సీపతి లింగాగౌడ్

ఆదివాసీ గ్రామాల్లో మహిళలకు చీరల పంపిణీ

భీంపూర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదివాసీ గ్రామాలైన లక్ష్మిపూర్, సెంటర్ సంగ్వి గ్రామాలలో ఆదివారం ఎస్వీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గిరిజన మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు సీడం వామన్ రావ్ మాట్లాడుతూ ఆదివాసీలు అభివృద్ధి చెందాలంటే చదువు ఒక్కటే మార్గం అని సూచించారు. ఇందులో మంచిర్యాల జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ ఆత్రం శ్రీకళ శ్రీనివాస్, రిటైర్డ్ ఉపాధ్యాయురాలు కుంరా సుమిత్ర, ఫౌండేషన్ ప్రతినిధులు పెందుర్ సింధు, కుడ్మెత భీమ్ రావ్, తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణం చేయిస్తున్న రైతులు

రైతులంతా కలిసి రోడ్డు నిర్మాణం

బోథ్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కనుగుట్ట గ్రామానికి చెందిన రైతులు అంతా కలిసి వారి పంట పొలాలకు వెళ్లేందుకు గాను రెండు కిలో మీటర్ల రోడ్డును వేయించుకున్నారు. గ్రామం నుంచి పెద్దవాగు వరకు రోడ్డు అక్రమణకు గురికావడంతో భవిష్యత్తులో రోడ్డుపై ఎడ్లబండ్లు వెళ్లేందుకు ఇబ్బందికరంగా మారుతుందని భావించి రోడ్డు నిర్మాణానికి పూనుకున్నారు. ఆదివారం రైతులంతా సమావేశమై అక్రమణకు గురైన రోడ్డును వెడల్పు చేసేందుకు నిర్ణయించారు. అందరి సహకారంతో రోడ్డు వేసుకుందామని తీర్మానించుకుని డబ్బులు జమ చేసుకొని జేసీబీని పిలిపించారు. పాత నక్ష ప్రకారం ఉన్న రోడ్డును నిర్మించుకునేందుకు చర్యలు చేపట్టారు. ఆదివారం దాదాపు కిలో మీటర్ వరకు మరో కిలో మీటర్ రోడ్డు సోమవారం పూర్తి చేసుకుంటామని రైతులు తెలిపారు. ఏదిఏమైనా రైతులు తమ పొలాల నుంచి పంటలను తీసుకువచ్చేందుకు ఇబ్బందులు ఎదురుకాకుండా ఈ నిర్ణయం తీసుకున్నారు.

భూ కబ్జాదారులపై పోలీసుల కొరడా

● నకిలీ పత్రాలు సృష్టించి కోట్ల విలువ చేసే భూమి కబ్జా ● పది మందిపై కేసు ● ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్ రెడ్డి

ఆదిలాబాద్ టౌన్/ ఆదిలాబాద్ రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : నకిలీ పత్రాలు సృష్టించి అధికారులతో కుమ్మక్కై సేత్వార్ల ద్వారా భూములను కాజేసిన భూ మాఫియాపై జిల్లా పోలీసు యంత్రాంగం కొరడా ఝుళిపించింది. తాజాగా పట్టణంలో భారీ భూ మాఫియాకు పాల్పడిన పదిమందిపై కేసు నమోదు చేయగా.. ఇందులో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు డీఎస్పీ జీవన్ రెడ్డి తెలిపారు. సర్వే నంబర్ 65/బీ, 65/4 లోని రెండెకరాల తొమ్మిది గుంటల భూమిని నిందితులు అక్రమంగా కాజేసేందుకు చూడగా... ఫిర్యాది దుమ్మటి సూర్య రామకృష్ణ సాయిబాబా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కేసులో ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారులైన రమేష్ శర్మ, ఇబ్రహీం మహ్మద్ అలియాస్ మామ్లు సెట్ లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని, మరో ఎనిమిది మందిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అక్రమంగా భూములు కాజేసే ప్రయత్నాలు చేస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. భూ మాఫియా దారులకు సహకరించిన ఇతర శాఖల అధికారుల పాత్రపై సైతం సమగ్ర దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించారు.